వరల్డ్ కప్‌లో టీమిండియా గెలవాలి

ఆదిత్య స్కూల్ విద్యార్థుల ప్రత్యేక ప్రదర్శన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా గెలవాలని కోరుతూ ఆదిత్య స్కూల్ విద్యార్థులు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.వాసుదేవ మాట్లాడుతూ ప్రపంచంలో రెండు అత్యుత్తమ జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా గెలవాలని 140 కోట్ల భారతీయుల ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్‌పి సమావేశానికి

ఎంఎల్‌ఎలు డుమ్మా..!

మాట్లాడతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, రెండు జిల్లాల కలెక్టర్లు ప్రసన్నవెంకటేష్, ప్రశాంతి, ఎంపీ, ఎంఎల్‌ఎలు

తూతూమంత్రంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కనీసం పట్టని మంత్రులు, 15 మంది ఎంఎల్‌ఎలకు ఇద్దరే హాజరు

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ రాకపోవడంపై సభ్యుల అసంతృప్తి

ఇళ్ల నిర్మాణం, కరువు, సాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల ఏకరువు

ఎంపిపిలను మాట్లాడనీయడం లేదంటూ పోలవరం ఎంపిపి ఆగ్రహం

సమాచార పుస్తకాలివ్వడం సైతం నిలిపేసిన జెడ్‌పి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని సమస్యలకు పరిష్కార వేదికగా కొనసాగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రం అన్నట్లు మారిపోయింది. మంత్రులు, ఎంఎల్‌ఎలు జెడ్‌పి సమావేశాన్ని పూర్తిగా పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. దీంతో ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన సమావేశం నామకేవాస్తే అన్నట్లు తయారైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశం తీరు చూసిన వారందరిలో జెడ్‌పి సమావేశం ఇలా తయారైందేమిటనే చర్చ సాగింది. గత ప్రభుత్వ హాయాంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక స్థానం ఉండేది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం సాగేది. మంత్రులు, ఎంఎల్‌ఎలు అంతా హాజరై ప్రజాసమస్యలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులను సమావేశంలోనే నిలదీసేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 మంది ఎంఎల్‌ఎలు ఉండగా జిల్లా పరిషత్ సమావేశానికి దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు మినహా ఏఒక్క ఎంఎల్‌ఎ హాజరు కాలేదు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండగా జిల్లాల విభజన జరిగాక ఒక్క మంత్రి కూడా జిల్లా పరిషత్ సమావేశానికి హాజరు కావడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పశ్చిమ కలెక్టర్ పి.ప్రశాంతి సమావేశానికి హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. జిల్లాలోని తొమ్మిది మండలాలు విభజనలో తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి. అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు సమాధానం చెప్పేందుకు ఆ జిల్లా నుంచి కలెక్టర్‌గాని, జాయింట్ కలెక్టర్‌గాని ఏఒక్కరూ రాలేదు. దీంతో అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదే కృష్ణా జిల్లా జెడ్‌పి సమావేశానికి ఇక్కడి అధికారులు వెళ్లకపోతే అక్కడి ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం తెలపడమే కాకుండా, ముఖ్యమంత్రి కార్యాలయం వరకూ సమస్యను తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. మంత్రులు, ఎంఎల్‌ఎలు సమావేశాలకు రాకపోవడంతో అధికారులను నిలదీసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సమస్యలపై సభ్యులకు సంతృప్తికరమైన సమాధానాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొన్ని విధానపరమైన నిర్ణయాల విషయంలో మంత్రులు ఉంటే తర్వాత సిఎంతో మాట్లాడే అవకాశం ఉంటుంది. మంత్రులు రాకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా పరిషత్ సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు ప్రత్యేకత ఉంటుంది. మినిట్స్‌లో నోట్ అవుతాయి. తర్వాత సమావేశంలోపు పరిష్కరించకపోతే అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్‌ఎలు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రోజంతా జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభించి మమ అన్పించేస్తున్నారు. జెడ్‌పిటిసి, ఎంపిపిలు లేవనెత్తిన ఒకటి, రెండు సమస్యలపై ముక్తసరిగా సమాధానాలు ఇచ్చి ముగించేస్తున్నారు. పలు సమస్యలు తర్వాత సమావేశంలోనూ కొనసాగుతున్న పరిస్థితి ఉంది. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్‌ఎస్.సుబ్బారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపిపిలను మాట్లాడనీయడం లేదు

పోలవరం ఎంపిపి ఎస్.వెంకటరెడ్డి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిపిలకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం లేదంటూ పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభ ప్రారంభంలో పోలవరం ఎంపిపి లేచి సమస్యలపై మాట్లాడగా సదరు అంశం వచ్చినప్పుడు మాట్లాడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. చాలాసేపు వేచిచూసిన తర్వాత జెడ్‌పిటిసిలు మాట్లాడటమే తప్ప ఎంపిపిలకు అవకాశం రావడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు సభలో గందరగోళం నెలకొంది. ఎంఎల్‌ఎలు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

పలు సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల గళం

తమ మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు-నేడుకు సంబంధించి స్కూళ్లలో పనులు జరగకపోవడం, నిండ్రకొలను పిహెచ్‌సిలో బెడ్స్ పెంచకపోవడం, సిబ్బంది నియామకం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సమస్యలను సభ్యులు లేవనెత్తారు. పదెకరాల్లోపు అర్హులైన ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తించకపోవడం, డ్వాక్రాకు సంబంధించి భవనాలు పూర్తి చేయకుండా వదిలేయడం, ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటల పరిస్థితిపైనా, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి, ఆరోగ్యశ్రీలో ఎదురవుతున్న ఇబ్బందులు, భూసర్వేలో జరుగుతున్న అవకతవకలను, దెందులూరు వంటి మండలాల్లో సాగునీటి సమస్య వంటి అనేక సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తడంతో అధికారులు సమాధానాలిచ్చారు.

దెబ్బతిన్న పంటల పరిస్థితి ఏమిటీ

కోటగిరి శ్రీధర్, ఎంపీ

'గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికోసం మంత్రి పదవిని సైతం వదిలేసేవారు. జిల్లా పరిషత్ ఎంత బాగా పని చేస్తే పరిపాలన అంతా బాగా జరుగుతుంది. చింతలపూడి వంటి మండలాల్లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిస్థితి ఏమిటీ' అని ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు సంబంధించి రెండు రకాలుగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రై డెడ్ కండీషన్‌లో 15 గ్రామాల్లో 1800 ఎకరాలు దెబ్బతిందన్నారు. వెదరింగ్ కండీషన్‌లో 8 గ్రామాల్లో 2,900 ఎకరాలకు ఇబ్బంది వచ్చిందని తెలిపారు. దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. జిల్లాలో ఏడు మండలాల్లోని 51 గ్రామాల్లో నాలుగు వేల ఎకరాల్లో 75 శాతం పంట దెబ్బతిందని, 11 మండలాల్లోని 91 గ్రామాల్లో 8,065 ఎకరాల్లో పంట వడిలిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు.

పిఆర్ 126 వరి వంగడం సాగుకు అనుమతించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.హరేరామ్

మాట్లాడుతున్న హరేరామ్

ప్రజాశక్తి - భీమవరం

తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో తక్కువ సాగునీటితో తక్కువ చీడపీడలతో ఎక్కువ దిగుబడి వచ్చే వరి వంగడం పిఆర్ 126ను రబీ సీజన్లో సాగు చేసేందుకు రైతులందరికీ అనుమతి ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ గతంలో ఈ వరి వంగడాన్ని 'ఎ' గ్రేడ్‌గా ప్రకటించి రైతుల నుండి కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ వంగడాన్ని సాగు చేయొద్దని ప్రకటించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన 1318 రకం మాసూళ్లు డిసెంబర్‌లోగాని పూర్తికాదని, ఈ నేపథ్యంలో దాళ్వాలో తక్కువకాలంలో పంట చేతికొచ్చే పిఆర్ 126 రకం సాగుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడం తగదన్నారు. సార్వా మాసూళ్లు జరుగుతున్నాయని, దళారీ వ్యవస్థ లేకుండా ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. గోనె సంచులు, జట్లు, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించాలని, కౌలురైతులందరికీ అందేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, గుత్తుల శ్రీరామచంద్రుడు, కొప్పిశెట్టి సత్యనారాయణ, యాతం రాంబాబు, కంకటాల భాస్కరరావు, గడ్డికోట వెంకటేశ్వరరావు, తాళ్లూరి హరిహరలక్ష్మణ్ పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే పేదలకు గుండె ధైర్యం

సామాజిక సాధికార బస్సు యాత్రలో హోం శాఖా మంత్రి తానేటి వనిత

మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - తణుకు

జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే పేదలు గుండెలపై చేయి వేసుకుని ధైర్యంగా బతుకుతున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. శనివారం పట్టణంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. నరేంద్ర సెంటర్‌లో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వనిత మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చేసిన మేలు వివరించేందుకే ఈ బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేపట్టడంతో చంద్రబాబుకు వణుకు ప్రారంభమైందన్నారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ సిఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎంతమంది కలిసొచ్చినా జగన్‌ను ఎలా కాపాడుకోవాలనేది ప్రజలే ఆలోచిస్తున్నారన్నారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ జగన్‌కు వ్యతిరేక ఓటు ఎక్కడా లేదన్నారు. ఈ సభలో మంత్రి జోగి రమేష్, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, సినీనటుడు ఆలీ, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడారు.

రక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు

కాంట్రాక్టర్‌కు ఆలం బిల్లు తక్షణం చెల్లించాలని ఆదేశం

పరీక్షలకు రంగు మారిన నీరు

పాలకోడేరులో పర్యటించిన డిఎల్‌పిఒ బాలాజీ వెంకటరమణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గ్రామస్తులకు రక్షిత నీరందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టామని భీమవరం డిఎల్‌పిఒ సిహెచ్.బాలాజీ వెంకటరమణ చెప్పారు. పంచాయతీలకు ఆలం సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు తక్షణం బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. 'ప్రజారోగ్యంపై పంచాయతీ చెలగాటం' అనే శీర్షికన పాలకోడేరు గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై 'ప్రజాశక్తి'లో శనివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. భీమవరం డిఎల్‌పిఒ బాలాజీ వెంకట రమణ పాలకోడేరులో పర్యటించారు. పంచాయతీ సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజుతో కలిసి డిఎల్‌పిఒ సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరాపై వివరాలు సేకరించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ గ్రామస్తులకు తాగునీటిని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలం సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు తక్షణం బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ఫిల్టర్ బెడ్‌లను డిఎల్‌పిఒ పరిశీలించారు. అక్కడ ట్యాంక్ వాచర్‌గా ఉన్న సురేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలంను నీటిలో కలిపి ఎన్ని రోజులవుతుంది, నీళ్లు ఎందుకు ఇలా రంగు మారాయని ప్రశ్నించారు. రంగు మారిన నీటి శాంపిల్స్ తీసుకుని పరీక్షలకు పంపాలని ఆదేశించారు. పంచాయతీలో ఉన్న సాధారణ నిధులతో ఫిల్టర్ బెడ్లను బాగు చేయాలని సూచించారు. పంచాయతీ కార్మికులకు సంబంధించిన జీతభత్యాలను తక్షణం చెల్లించాలని ఆదేశించారు. డిఎల్‌పిఒ వెంట సర్పంచి మరియమ్మ లక్ష్మీపతి, కార్యదర్శి వెంకట్‌రాజు ఉన్నారు.

ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

జాయింట్ ఎక్కౌంట్ ఉత్తర్వులు రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - భీమవరం

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతో విద్యార్థికి కూడా ఉమ్మడిగా బ్యాంక్ అక్కౌంట్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రారంభం నుండి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా విద్యార్థిని కూడా చేర్చి జాయింట్ అక్కౌంట్ చేయడం వల్ల కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యాదీవెన పథకంలో నాలుగు దఫాల్లో చివరి దఫా గత రెండేళ్లుగా అమలు చేయలేదని పేర్కొన్నారు. వసతిదీవెన రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.1600 కోట్లు మిగుల్చుకుందని పేర్కొన్నారు. ఇవన్నీ చూస్తుంటే కొత్తగా పెట్టిన నిబంధన కూడా పథకాల్లో కోతలు విధించేందుకే అని స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా కోతలు విధించి నిధులు మిగుల్చుకునే కార్యక్రమం సిగ్గుచేటని పేర్కొన్నారు. కొత్త నిబంధన వల్ల ప్రయోజనం లేకపోగా అనేక నష్టాలు వాటిల్లుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాయింట్ అక్కౌంట్ నిబంధనను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ.1600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

బడుగు బలహీన వర్గాల పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశాన్ని శనివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు జివి.రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న వేళ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. పాఠశాలల విలీనంతో ప్రాథమిక విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నమై క్రమంగా సెకండరీ విద్య కూడా కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు మాట్లాడుతూ ఈ నెల 19న నరసాపురం వైఎన్ కళాశాలలో నిర్వహించే జిల్లా కౌన్సిల్ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయ రంగం ఉన్నత స్థితిలో ఉందన్నారు. సిపిఎస్ జిల్లా కన్వీనర్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ వద్దని ఒపిఎస్ మాత్రమే కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్‌బాబ్జి, ప్రసాద్‌బాబు, అచ్చియ్య, నాగమునేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి పట్టాభిరామయ్య పాల్గొన్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షునిగా కె.నాగమునేశ్వరరావు, అధ్యక్షునిగా జివి.రమణ, అసోసియేట్ అధ్యక్షునిగా బి.అచ్చియ్య, మహిళా కార్యదర్శిగా జి.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎంఎంఎస్‌సిహెచ్.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎం.దుర్గారావు, మరో తొమ్మిది మంది కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

26 నుంచి విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర

రెండు నెలలపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చేందుకు, పథకాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర విధివిధానాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ యాత్రలో మొబైల్ వ్యాన్‌పై పట్టణ, గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలో అన్ని పట్టణాలు, పంచాయతీల్లో ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన వాహనాలు కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. ప్రచారంతోపాటు పథకాలతో లబ్ధి పొందిన వారి అభిప్రాయాలను సేకరిస్తారని, అలాగే అర్హులై ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి ప్రయోజనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

గుంతలను పూడ్చండి

టిడిపి, జనసేన ఆధ్వర్యాన ఆందోళన

ఆందోళన నిర్వహిస్తున్న టిడిపి, జనసేన శ్రేణులు

ప్రజాశక్తి - ఉండి

రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చి, అభివృద్ధి చేయాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన ఆధ్వర్యాన శనివారం ఉండి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నుండి పాదయాత్ర చేపట్టారు. ఉండి నుండి వాండ్రం వెళ్లే రహదారి వద్దకు చేరుకుని ఆ రోడ్డుపై బైఠాయించి 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారెక్కడ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు మాట్లాడుతూ రహదారులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ దారుల్లో ప్రయాణించాలంటే ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఆర్‌అండ్‌బి అధికారులు అందుబాటులో లేకపోవడం దారుణమని, ఇక్కడ ఉండాల్సిన ఎఇ తన కార్యాలయాన్ని భీమవరంలో ఏర్పాటు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కరిమెరక నాగరాజు, కట్టా రాంబాబు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, కందుల బలరాం, ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయి లచ్చిరాజు, కాగిత బుజ్జి, చెన్నంశెట్టి హరినాయుడు, జనసేన నాయకులు గవర అనిల్, యర్రా రవి, పెదపాటి ప్రసాద్, కంది దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పాతపాటే..!



'మళ్లీ అవే మాటలు.. అవే ప్రకటనలు.. ఇక కార్యాచరణపైనే అందరి దృష్టి'.. ఇదీ దాళ్వాకు సాగునీరు అందజేత, నూజివీడులో సిఎం పర్యటన, ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం అంశాల విషయంలో ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారుల తీరు.

దాళ్వాకు సాగునీరు అందజేతపై ఇటు ఏలూరు, అటు పశ్చిమగోదావరి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యాన జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. రెండు సమావేశాల్లోనూ గోదావరిలో నీటి లభ్యత, సీలేరు జలాలు తదితర అంశాలతోపాటు కాల్వలకు నీరు నిలిపివేత ఎప్పటి నుంచి అనేది చర్చించి తీర్మానాలు చేశారు. అక్కడా.. ఇక్కడా కూడా ఇరిగేషన్ అధికారులు లెక్కలు చెప్పగా వాటినే వివిధ రూపాల్లో సర్ది దాళ్వా సాగుకు సమృద్ధిగా సాగునీరందిస్తామని ఆయా మంత్రులు ప్రకటించేశారు. ఆపై నారుమడుల ప్రక్రియ ఈ నెలాఖరుకల్లా ముగించేయాలని సైతం స్పష్టం చేశారు. లేనిపక్షంలో సాగునీటి ఇబ్బందులు తప్పవని చల్లగా చావుకబురు చెప్పకనే చెప్పారు. దానికి సంబంధించి నారుమళ్ల ప్రక్రియ వేగవంతం చేసే బాధ్యత వ్యవసాయ శాఖపై మోపారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఏలూరు జిల్లాలో చింతలపూడి, చాట్రాయి తదితర మెట్ట మండలాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కరెంటు సక్రమంగా సరఫరా కాక బోర్ల కింద పంటలు సైతం ఎండిపోయే దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై కనీసం చర్చకు అవకాశం ఇవ్వకపోగా ప్రస్తావించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని నిలువరించి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకోవాలని చెప్పడం హాస్యాస్పదమనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. సమస్యపై చర్చించి ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సిన సమావేశంలో సమస్యను పక్కదారి పట్టించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక దాళ్వా సాగుకు సంబంధించి నారుమళ్లు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో నీరు సక్రమంగా అందక, ప్రకృతి కన్నెర్రతో దిగుబడులు తగ్గి రైతులు తల్లడిల్లుతున్నారు. పైకి కన్పించకపోయినా గత దాళ్వాలో ధాన్యం అమ్ముకునే సమయంలో ఎదురైన ఇబ్బందులన్నీ ప్రస్తుతమూ రైతులను వెంటాడుతున్నాయి. అయితే ఇంకా మాసూళ్లు పూర్తికాకపోవడంతో సమస్య తీవ్రత పెద్దగా తెలియడం లేదు. అయితే ఆర్‌బికెల్లో నిర్ధారించిన తేమ శాతమే ఫైనల్ అని, మిల్లర్లు ఎందుకు మళ్లీ తేమ శాతంపై మెలిక పెడుతున్నారనేది పరిశీలిస్తామని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ ఉంగుటూరులో రైతులకు చెప్పారంటే సమస్య అపరిష్కృతంగానే ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగానే రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని మన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. మరి ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకుండా, రైతుల చేతికి సొమ్ము రాకుండా దాళ్వాసాగు ఎలా ప్రారంభిస్తారో అధికారులు, ప్రజాప్రతినిధులే చెప్పాలి. సాగులో ఆలస్యానికి ప్రధాన కారణాల్లో ఒకటి ప్రకృతి విపత్తులైతే ప్రధానమైనది మాత్రం పెట్టుబడి సమస్య. సాగులో 80 శాతంగా ఉన్న కౌలురైతులకు కనీసం రుణార్హత గుర్తింపు కార్డులు ఇవ్వడంలోనే బాగా వెనుకబాటు ఉంది. ఆ కార్డులు అందుకున్న వారికి రుణాలివ్వడంలోనూ బ్యాంకర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదని కలెక్టర్లు నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో తేటతెల్లమవుతోంది. ఈ పరిస్థితుల్లో ధాన్యం అమ్మకాలు పూర్తికాకుండా రైతులు దాళ్వా సాగు ఎలా చేపడతారో అధికారులు, ప్రజాప్రతినిధులకే తెలియాలి. కనీసం ఇప్పటికైనా దాళ్వా సాగుకు అవసరమైన పెట్టుబడిని రుణాల రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగితే నిర్ణీత సమయంలో నారుమళ్ల పనులు రైతులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదేమీ లేకుండా సమృద్ధిగా సాగునీరంటూ మరోసారి రైతులను నష్టాల ఊబిలోకి దించొద్దని పరిశీలకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

నూజివీడులో సిఎం పర్యటన ఊరించి ఉసూరుమన్పించింది. అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేసేందుకు నూజివీడులో శుక్రవారం పెద్దఎత్తున సభ నిర్వహించారు. చింతలపూడి ఎత్తిపోతలను త్వరలోనే పూర్తి చేస్తాం, నూజివీడులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, నూజివీడు పట్టణంలోని 32 వార్డులకు రూ.కోటి చొప్పున అభివృద్ధి నిధుల మంజూరు తప్ప సిఎం జగన్ ఇతర అంశాల జోలికెళ్లలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి ఈ ప్రభుత్వం వచ్చాక చేసిందేమీ లేదు. కనీసం చింతలపూడి పరిసర ప్రాంతాల్లో భూసేకరణ నేపథ్యంలో నష్టపోతున్న రైతులకు సంబంధించి పరిహారం సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది. ఈ సమస్యలన్నీ అలానే ఉంచి యుద్ధప్రాతిపదికన ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తామంటే ఎవరూ నమ్మే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇక నూజివీడు మామిడి జాతీయస్థాయిలోనే ప్రసిద్ధి చెందింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సమస్యలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో మామిడి సాగు క్రమేపీ కుచించుకుపోతుంది. ఈ నేపథ్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామనడం తప్ప మామిడి సాగు ప్రోత్సాహకానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించకపోవడం మామిడి రైతులను నిరాశపర్చింది. నూజివీడు పట్టణంలో 16 సచివాలయాలకు రూ.కోటి చొప్పున నిధులిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. అంటే ఒక్కో వార్డుకు రూ.50 లక్షల వరకూ నిధులిచ్చినట్లే. ఇదే ఆచరణకు నోచుకుంటే ఆయా వార్డుల్లో చిన్నపాటి సమస్యలు కొన్ని పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇవి మినహా సిఎం ప్రసంగంలోని మిగిలిన అంశాలన్నీ కొత్త సీసాలో పాత నీరువంటివేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో పేరుకుపోయిన రోడ్ల అధ్వానం, మెట్ట ప్రాంతంలో కరువు ఛాయలు, కొల్లేరు, పరిసర ప్రాంతాల ప్రజల్లో నెలకొన్న ఎకోసెన్సిటివ్ జోన్ భయాందోళనలపై సిఎం జగన్ కనీసం నోరు మెదపకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూడా సిఎం నుంచి ఎటువంటి నిర్దిష్ట హామీలూ రాకపోవడం నూజివీడు ప్రాంత ప్రజలతోపాటు ఏలూరు జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. ఇప్పటికైనా మళ్లీమళ్లీ పాతపాట మాని రెండు జిల్లాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని జిల్లావాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఎన్నికల్లో ఈ ప్రభుత్వం విషయంలో జనాలు పునరాలోచించే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పంచాయతీ చట్టాలపై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా పంచాయతీ శాఖాధికారి జివికె.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక విష్ణు కాలేజీలో పంచాయతీ సంస్థల బలోపేతంపై జిల్లాలోని డివిజనల్ పంచాయతీ అధికారులు, ఇఒపిఆర్‌డిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, అమలు, విధానాలు, ఇబ్బందులుపై క్షుణ్ణంగా సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఇన్‌ఛార్జి డివిజనల్ పంచాయతీ అధికారి యుఎస్ఎస్.శ్రీనివాస్, భీమవరం డివిజనల్ పంచాయతీ అధికారి సిహెచ్.బాలాజీ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆశాలపై వేధింపులు తగవు : సిఐటియు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇప్పటికే 26 రకాల పనులు చేస్తున్న తమను వారి పనులు కూడా చేయాలని, లేకపోతే మా సంగతి చూస్తామని బెదిరిస్తున్న ఆశావర్కర్ల నోడల్ ఆఫీసర్ పిహెచ్ఎన్.ఉమాదేవి, హెచ్‌వి.అనంతలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్లు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మార్టేరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ మల్లికకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు కె.సుబ్బరాజు మాట్లాడుతూ సదరు అధికారులు గ్రామాల్లో గర్భిణులను సందర్శించకుండా ఆశాలే ఆ పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సరైన వైద్య సేవలు అందించని పిహెచ్‌సి అధికారులు ఉమాదేవి, అనంతలక్ష్మిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని విచారణ జరిపించాలని, ఆశావర్కర్లపై వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రాల్లో శనివారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సొసైటీ ఛైర్మన్లు రైతులు పాల్గొన్నారు.

పాలకోడేరులో ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు శనివారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత, ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, రోగ నిరోధక శక్తి ఎలా పెంపొందించుకోవాలో అవగాహన సదస్సులో వివరించారు. ముఖ్యంగా ప్రకృతి వైద్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

పైపులైన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ ప్రాంతంలో పంచాయతీ పైపులైన్ మరమ్మతుల కారణంగా నీరు రావడం లేదని బ్రాహ్మణచెరువుకు చెందిన దాట్ల వెంకట సుబ్రహ్మణ్యంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుమంట్ర నుంచి బ్రాహ్మణచెరువు తాగునీరు పైపులు మరమ్మతుల కారణంగా ఆ ప్రాంతంలో నీరు లేక ప్రాంతవాసులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. త్వరగా మరమ్మతులు చేసి నీరందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై పెనుమంట్ర ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావును వివరణ కోరగా మరమ్మతులు వెంటనే పూర్తి చేసి నీరు అందిస్తామని చెప్పారు.

నేడు ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉండి పెద్దవంతెన సెంటర్ వద్ద ఉన్న కాంగ్రెస్ స్థూపం వద్ద ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు నివాళులర్పించే కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జగన్‌వి కక్షపూరిత రాజకీయాలు : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిఎం జగన్ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. గరువు, మాముడూరు గ్రామాల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పితాని సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కటికల సాంబశివ, ఆనంద రెడ్డి, సుబ్బారెడ్డి, తాతారావు, నరసింహరాజు, టిఎన్.రెడ్డి, మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లాలు), మండల కార్యదర్శి గూడూరి మురళి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆచంట : ఎస్‌సి, ఎస్‌టి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యపడుతుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, నియోజకవర్గ చర్చావేదిక టిడిపి జనసేన ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం కందరవల్లిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడారు.

'ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్తాం'

ప్రజాశక్తి - కాళ్ల

కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన

రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపి-జనసేన ఉమ్మడి కార్యచరణతో ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కోలనపల్లిలో ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం, ఇంటింటికి మన రాంబాబు, బాబుతో నేను కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు మినీ మేనిఫెస్టోలోని పథకాల వివరాలు ఉన్న కరపత్రాలను, అక్రమ అరెస్టు నేపథ్య వివరాలు ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు వేగేశ్న సుబ్బరాజు (రమేష్ రాజు), వేగేశ్న రఘురామరాజు, ప్రసాదరాజు, సోమరాజు, నరసింహరాజు, తోట ఫణిబాబు, కె.శ్రీనివాసరావు, పుప్పాల వాసు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను విజ్ఞాన సముపార్జనకు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థినులు తమకు అందుబాటులో ఉన్న ట్యాబ్‌లను విజ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకోవాలని భీమవరం దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దిశ ఎస్ఐ జయలక్ష్మి, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి మాట్లాడారు. అనంతరం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ తరపున దిశ పోలీస్‌స్టేషన్ జయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ ఎన్.సుబ్బరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చేతి పంపు బహూకరణ

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ములపర్రు శివారు పితానివారిపాలెంలో ఉన్న అంగన్‌వాడీకేంద్రం-3కు గ్రామానికి చెందిన దాత పితాని రాంబాబు, లక్ష్మీదుర్గాభవాని దంపతులు రూ.18 వేల విలువైన చేతిపంపు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పితాని తిరపయ్య, వేండ్ర లక్ష్మీనారాయణ, వేండ్ర సత్యనారాయణ, గుత్తుల ఏడుకొండలు, అంగన్‌వాడీ టీచర్ కె.దుర్గ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'వైసిపిది అవినీతి పాలన'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జగన్ పాలన మొత్తం అవినీతిమయంగా మారిపోయిందని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ అన్నారు. జనసేన-టిడిపి ఉమ్మడిగా చేపట్టిన ఇదేమి రాజ్యం - గుంతల రాజ్యం, గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నాగాంజనేయుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామానికి చెందిన మంతెన నాగాంజనేయులు చిన్నవయసులోనే తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు నిర్వహిస్తూ వ్యాపారంలో రాణిస్తూ పదిమందికి మంచి చేయాలనే లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకవైపు నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మరోవైపు సామాజిక స్పృహతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రజలకు ఆపన్నహస్తంగా నిలుస్తున్నారు. పుట్టిన ఊరిపై మమకారంతో ఆరేళ్లుగా కోమటిగుంటలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత స్థితికి చేరారు. వ్యాపారంలో సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా రెండు ఫ్రీజర్లు ఏర్పాటు

మంతెన సన్యాసిరావు, నాగమణి జ్ఞాపకార్థంగా రెండు ఫ్రీజర్లను కొనుగోలు చేసి గ్రామస్తుల కు అందుబాటులో ఉంచారు. ప్రత్యేకంగా ఒక షెడ్డు నిర్మించారు.

పలు అభివృద్ధి పనులు

గ్రామ ప్రజల సౌకర్యం కోసంపంట కాలువపై


మహిళలకు దుస్తులు అందిస్తున్న నాగాంజనేయులు

కాలిబాట వంతెనను రూ.1.50 లక్షలతో నిర్మించారు. కోమటిగుంట గ్రామంలో కోదండ రామాలయం వీధిలో సిమెంట్ డ్రెయినేజీ నిర్మాణ పనులు రూ.2 లక్షలతో చేపట్టారు. రామాలయంలో భోజన శాల ఏర్పాటుతో పాటు గార్డెన్‌లో మొక్కలు నాటారు. రామాలయంలో భక్తులకు నీటి సౌకర్యాన్ని కల్పించడంతో పాటు వాష్ బేసిన్లు ఏర్పాటు చేశారు. సూర్యారావుపేట ప్రాంతంలో ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ ఆలయాల్లో కూడా వాష్ బేసిన్లు ఏర్పాటు చేశారు.

ప్రతి ఏడాది అన్నదాన కార్యక్రమాలు

గ్రామంలో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు ప్రతిఏడాది శ్రీరామనవమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కోమటిగుంట గ్రామంలో కెవిఎల్ సీఫుడ్స్ సంస్థ అధినేత మంతెన నాగాంజనేయులు ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాల సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన నాగాంజేయులు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ రామరాజును ఘనంగా సత్కరించారు.

గ్రామావృద్ధికి తోడ్పాడతా

మంతెన నాగాంజనేయులు

కరోనా సమయంలో పేద ప్రజలకు రూ.1.50 లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు మూడు సార్లు పంపిణీ చేశాను. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు చేతులమీదుగా 50 మంది భక్తులకు దుస్తులను పంపిణీ చేశాం. రామాలయం అర్చకునికి కాసు బంగారాన్ని అందించాం. నావంతు సహకారం అందిస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పాడుతున్నారు.

ప్రజలకు రక్షిత తాగునీరందించాలి : ఎంపిపి

కాళ్ల : మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ కనకరాజు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామ ప్రజలకు లంక ఛానల్ ద్వారా సురక్షిత నీరు అందించాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాళ్ల ఎంపిటిసి సభ్యులు పాపోలు సత్యవతి కోరారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపిడిఒ ఎంవి.భాస్కరరావు మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వాయంతో ఉండాలన్నారు. మండల వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకి, హౌసింగ్ ఎఇ సి.ఆంజనేయరాజు, ఎంఇఒ గాదిరాజు కనకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, తహశీల్దారు టిఎ.కృష్ణారావు, మండల ఉపాధ్యక్షురాలు సరాబు పద్మారాణి, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, విద్యుత్ శాఖ ఎఇ పి.రాంబాబు, పశువైద్యాధికారి చంద్రబాబు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల ప్రస్తావన లేని సమావేశం

ఉండి : మండలంలో తాగునీటి సమస్య లేకుండా ప్రతిఒక్కరికీ తాగునీటిని అందించాలని ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. ఎంపిపి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండానే తూతూ మంత్రంగా సాగిందని పలువురు అంటున్నారు. వాండ్రం సర్పంచి దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ గతంలోనే తమ గ్రామంలోని దళితవాడలో ఉన్న పాఠశాలకు నాడు-నేడు కార్యక్రమంలో నిధులు మంజూరయ్యాయని, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ఆగస్టులో తమ గ్రామాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా నేటికీ ఆ ప్రతిపాదన పూర్తి కాలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ సర్పంచి కొండవీటి సాంబశివరావు, ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, కునుకు రమాదేవి శ్రీనివాస్, నిమ్మల కేశవ్‌కుమార్, దత్తాల సుజాతరాణి, రాయి రావులమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకొల్లులో...

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గొల్లలకోడేరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులు ఈ క్విజ్‌పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జి.బాలరాజు విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్య గొప్పతనన్ని వివరించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ విక్టర్‌పాల్ పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జిన్నూరు శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్, క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలను ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, జివి.నరసింహరావు నిర్వహించారు.

పెనుమంట్ర : మార్టేరు రోటరీలో 35 మంది విద్యార్థులు దేశభక్తి గీతాలు, పాటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి మానవత పెనుమంట్ర శాఖ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి శ్రీనివాసుల మురళీకృష్ణ, సంగీతం మాస్టర్ జె.రాజకుమార్ మాస్టారు, చదువుల సుబ్రహ్మణ్యం మాస్టారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

పాలకొల్లు : డిజిటల్ లైబ్రరీలను ప్రజలు ప్రోత్సహించాలని విశ్రాంత ఎంఇఒ యర్రా అజయ్‌కుమార్ చెప్పారు. పాలకొల్లు శాఖా గ్రంథాలయంలో డిజిటల్ గ్రంథాలయాలు-ఉపయోగాలు అంశంపై ఆయన మాట్లాడారు. మారుతున్న ఆధునిక సాంకేతికకు అణుగుణంగా లైబ్రరీలు ఆధునీకత జరగాలని కోరారు. గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలకు డిజిటల్ లైబ్రరీలు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. గ్రంథాలయ అధికారి వి.శాంతకుమారి, సిహెచ్.పెద్దిరాజు, మల్లయ్య, సత్యనారాయణ, సత్యవాణి పాల్గొన్నారు.

ఉండి : ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండి శాఖా గ్రంథాలయం అధికారి జక్కంపూడి వెంకటకృష్ణమూర్తి అధ్యక్షతన సైబర్ నేరాలు, లోన్ యాప్, దిశా చట్టాలు, మాదకద్రవ్యాల గురించి విద్యా ర్థులకు మహిళా పోలీసులు ఎం.కుమారి, ఎన్.వాహిని, ఎండి ఫాతిమా, వై.రేవతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాచరచన, క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సుమారు 50 మంది పాల్గొన్నారు. పోటీలకు పరిశీలకులుగా ఎం.మామూళ్లు, ఆర్లపాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అడ్డాల నరసింహరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థుల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమని ఎపి నిట్ అసోసియేట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ పెద్దపాటి శంకర్ తెలిపారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం ఉద్యాన పంటల్లో ఆధునిక సాంకేతిక పాత్ర అంశంపై ఎపి నిట్, ఉద్యాన విశ్వ విద్యాలయం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా నిట్ ఆచార్యులు శంకర్, డాక్టర్ ఫణికృష్ణ, ఉద్యాన విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎఎస్.పద్మావతమ్మ, విస్తరణ సంచాలకురాలు డాక్టర్ కరుణశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.నారంనాయుడు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సలోమీ సునీత, ఆచార్యులు డాక్టర్ ఉమాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీల్లో లోపాల గుర్తింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సహకార సంఘంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఆర్థిక లావాదేవిపై ఆడిట్ నిర్వహించిన అధికారులు పలు లోపాలను గుర్తించారు. రూ.78,14,843 జరిగిన లావాదేవీలకు నిబంధనలు పాటించలేదని నివేదికలో పేర్కొన్నారు. దీంతో 51వ విచారణకు జిల్లా సహకార శాఖాధికారి ఆదేశించారు. నరసాపురానికి చెందిన సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ జె.వెంకటేశ్వరరావును విచారణ అధికారిగా ఉన్నతాధికారులు నియమించారు. ఆయన రికార్డుల పరిశీలన ప్రారంభించారు. పలువురు సహకార సంఘ సభ్యుల వద్ద నుంచి రూ.5,11,489 షేర్ దానం, వడ్డీ తక్కువ వసూలు చేసినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. భూములకు చట్టపరమైన పత్రాలు లేకుండానే రూ.27,06,854 ఆన్‌లైన్‌లో వివరాలేని భూములకు రూ.14.32 లక్షల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఇర్ రెగ్యులారిటీగా జరిగిన లావాదేవీలపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని విచారణ అధికారికి ఆదేశించారు. అధికారి విచారణను ప్రారంభించారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - వీరవాసరం

వచ్చే నెల తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ ఎన్.సుధీర్ తెలిపారు. న్యాయ విజ్ఞాణ సదస్సును సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల-2 వేల్పూరులో వార్షిక తనిఖీలో భాగంగా ఎంఇఒ డి.మురళీసత్యనారాయణ శనివారం సందర్శించారు. పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ ఎపిఒకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీ చట్టం మొగల్తూరు ఎపిఒ వై.శ్రీనివాస్ నరసాపురం ఎపిఒగా బదిలీ అ య్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు శనివారం సత్కరించారు. టెక్నికల్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - అత్తిలి

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. అత్తిలిలోని మేడబడిలో యుటిఎఫ్ అత్తిలి మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండలాధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులుగా ఎస్.స్వామి, ఎ.అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 మంది ఆఫీస్ బేరర్లు, ఏడుగురు జిల్లా కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఎన్నికల అధికారిగా ఎం.రామకృష్ణంరాజు హాజరయ్యారు. గోపీమూర్తి మాట్లాడుతూ 117 జిఒ వల్ల రాష్ట్రంలో అనేక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. పాదయాత్రలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను జగన్ అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఉద్యమ అభినందనలు తెలిపారు. ఆదివారం నిర్వహించే జిల్లా కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

'మానవత'కు ఫ్రీజర్ బాక్స్ అందజేత

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఫ్రీజర్ బాక్స్‌ను మానవత సంస్థకు అందిస్తున్న సత్యసాయి, కాశీవిశ్వనాథ్

మండలంలోని దువ్వ గ్రామంలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు వర్ధినీడి కృష్ణమూర్తి(సాయిరాం మాస్టారు) జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యసాయి(బిజినెస్), కాశీవిశ్వనాథ్ (ఉపాధ్యాయులు) సుమారు రూ.70వేల విలువైన మార్చురి ఫ్రీజర్ బాక్స్‌ను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తణుకు శాఖ వారికి శనివారం అందించారు. ఈ సందర్భంగా జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ మానవత సంస్థ సభ్యులు, దాతల సహకారంతో ఫ్రీజర్ బాక్స్‌లు, శాంతి రథాల సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మానవత తణుకు శాఖ అధ్యక్షులు అక్కపంతుల బాలాజీ, కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, రీజియన్ కన్వీనర్ ఎస్‌వి.సతీస్‌బాబు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సిఎం జగన్ లక్ష్యం

సంక్షేమ పథకాలు వివరిస్తున్న సర్పంచి శేషవాణి సుబ్బారావు

ప్రజాశక్తి - ఆచంట

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని పెనుమంచిలి సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా శనివారం పెనుమంచిలి గ్రామంలో ప్రభు త్వ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. తొలుత గ్రామ సచివాలయ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ డిజి టల్ బోర్డు ప్రారంభించి, జెండా ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రిగా జగన్మో హన్ రెడ్డి మంచి గుర్తింపు పొందారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు జక్కంశెట్టి చంటి, ఉప స ర్పంచి గంటి బాబూరావు, వైసిపి గ్రామ కన్వీనర్ నక్క ప్రేమ్ కుమార్, కమిటీ ఛైర్మన్ భీమారావు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్-1938 మండల కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

మండలంలోని ఎపిటిఎఫ్-1938 మండల కార్యవర్గ ఎన్నికలు భీమవరం పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా జిల్లా శాఖ కన్వీనర్ రమణ వ్యవహరించారు. భీమవరం మండల గౌరవ అధ్యక్షురాలిగా కెవిఎన్.ఉమాదేవి, మండల అధ్యక్షురాలిగా డి.తిరుమలేశ్వరి, అసోసియేట్ అధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా బిడికె.మహనీయం, కె.జాన్‌మోజెస్, పి.రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీవల్లి, అదనపు కార్యదర్శిగా సిహెచ్ఎన్ఆర్ఎల్.కుమారి, కార్యదర్శులుగా ఆర్.నాగలక్ష్మి, బి.ఆదినారాయణ, ఎన్.సూర్యకళ, ఎస్.మమత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రమణ నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల అధ్యక్షురాలు తిరుమలేశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీవల్లి మాట్లాడుతూ ప్రభుత్వం ఒపిఎస్‌ను పునరుద్ధరించేవరకు పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. జిల్లా కన్వీనర్ రమణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు జెడ్‌పిపిఎఫ్ రుణాలు చెల్లించాలని కోరారు.

పర్యాటక కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని దొంగరావిపాలెం వశిష్ట గోదావరి పక్కన ఉన్న పర్యాటక కేంద్రాన్ని, చుట్టుపక్కల ఉన్న భూములను ఆర్‌డిఒ ఎంఎ.అంబరీష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

శ్రీవాసవిలో టెక్ ఇగ్నైట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఐఐసి) ఆధ్వర్యంలో శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థుల వినూత్న ఆలోచనలు నూతన వ్యాపార అవకాశాలకు ఎలా దోహదపడతాయనే అంశంపై శనివారం టెక్ ఇగ్నైట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు తమలోని నూతన సాంకేతిక వ్యాపార ఆలోచనలను పోస్టర్ రూపంలో ప్రదర్శిం చారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారా యణ, చలంచర్ల సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థ లకు నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు.

'పిఆర్ 126 రకం సాగు చేయొద్దనడం సరికాదు'

ప్రజాశక్తి - పోడూరు

రైతులకు లాభసాటి రకమైన పిఆర్ 126 రకం విత్తనాన్ని ఖరీఫ్‌లో పండిస్తే రబీకి రైతులంతా కొనుగోలు చేసి నారుమళ్లు చేసే సమయానికి సాగు చేయొద్దనడం సరికాదని రైతు సంఘం పోడూరు అధ్యక్షులు ఆర్.శివరామ కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుపతి నాయుడు అన్నారు. స్థానికంగా శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇదే విషయాన్ని ఖరీఫ్ ఆరంభంలోనే తెలియజేస్తే రైతులు విత్తన రకంగా సాగు చేయకపోదురన్నారు.

పాస్‌పోర్టు పోయినది

Guttula Srinivasa Rao అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 16-08-2009న **A197504** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు ది. 6-11-2023న పీతానివారిపాలెం గ్రామం నుండి పెనుగొండ మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GUTTULA SRINIVASA RAO
S/o. Guttula Mohana Rao
D.No. 6-173, Peetani vari Palem,
Penugonda Mandal
West Godavari Dist., A.P.

ప్రకటన

నిట్టా సోమరాజు, S/o. కనకాంబరం అయిన నేను ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామంలో 300 చ॥గ॥ స్థలము R.S. No. 98/1 ను అన్నపనేని జమున గారి ద్వారా క్రయమును పొంది **ద.నెం. 1679/2020** తదాది నా స్వాధీనములో ఉన్న ఆస్తియై యున్నది. అయితే సదరు దస్తావేజు మరియు లింకు డాక్యుమెంట్స్ జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో లింకు డాక్యుమెంట్ నెం. 4035/2002 ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనను దొరికిన యెడల నాకు తెలియపర్చగలరు.

నా సెల్ నెం. 9705874796

పాస్‌పోర్టు పోయినది

తాటిపర్తి ఎస్తేర్ రాణి, భర్త: చినబాబు నాయొక్క పాస్‌పోర్టు పోయినది. దేవ నుండి పెనుగొండ వస్తూండగా పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబర్: **V4399261** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
తాటిపర్తి ఎస్తేర్ రాణి
భర్త: చినబాబు
దేవ, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9133296636

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.A. 34/2022 in E.P. 46/2022 in O.S. 104/2019

Between:
గంధం ఏడుకొండలు ...DHR
AND
కొండు సహదేవుడు వగైరా -JDRs

పై నెంబరు E.P. గ్రంధములో JDRs అయిన 1. కొండు సహదేవుడు, S/o. ముసలయ్య, హిందు, పురుషుడు, వయస్సు 38 సం॥లు, డో.నెం. 5-200, బోర్డు స్కూలు వద్ద, అడవికొలను (V), నిడమర్రు (M) ప॥గో॥జిల్లా. 2. కొండు భవాని, W/o. సహదేవుడు, హిందు, స్త్రీ, వయస్సు 32 సం॥లు, డో.నెం. 5-200, బోర్డు స్కూలు వద్ద, అడవికొలను (V), నిడమర్రు (M) ప॥గో॥జిల్లా లు శ్రీ కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసులు పంపమని ఆర్డరు యిచ్చియున్నారు. సదరు E.A. 341/2022 గ్రంధము ది. 23-11-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ది. **23-11-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయ్యి తమ ఆక్షేపణలను తెలియజేయవలసిందిగా యిందుమూలంగా తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం
17-11-2023
Sk.Md.భాషా
అడ్వకేట్, తాడేపల్లిగూడెం